క్లుప్తంగా

స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపాలి



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి దస్తగిరి రెడ్డి , కే శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని రామ కృష్ణ నగర్ లో స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఇచ్చిన హామీ అమలుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అనంతరం ఇంటింటికి స్మార్ట్ మీటర్లు రద్దు స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకురాలు ఐఎన్ సుబ్బమ్మ, కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహ, కామేశ్వరమ్మ, స్థానిక రామకృష్ణ నగర్ కెవిపిఎస్ నాయకులు సి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమాయకులపై కేసులు పెట్టడం దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్: బాలిక అదృశ్యం అయ్యిందనే మానవతా దృక్పథంతో వేంపల్లె పోలీసు స్టేషన్ వద్దకు ముస్లిం వర్గానికి చెందిన పలువురు చేరుకున్నారే తప్ప వేరే ఉద్దేశంతో కాదని, పోలీసులు మాత్రం ముట్టడి చేశారనే కారణంతో అమాయకులపై కేసులు పెట్టడం సరైంది కాదని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం వర్గానికి చెందిన పలువురు మిగతా వర్గాలకు చెందిన వారు కూడా పార్టీలను పక్కనపెట్టి పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి గుమికూడారే తప్ప వేరే ఉద్దేశంతో ఆ ప్రాంతంలోకి ఎవరూ రాలేదని చెప్పారు. పోలీసులు కూడా మానవతా దృక్పథంతో ఆలోచించి తగు న్యాయం చేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి ఇప్పటికే అదుపులోకి తీసుకున్న అమాయకులను విడిచి పెట్టాలని కోరారు.

జిల్లా కమిటీ ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్ : ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతం దిశగా జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన పార్టీ నేతలనుద్దేశించి మాట్లాడారు. పార్టీ జిల్లా కన్వీనర్‌గా సాజిద్ హుసేన్, కో కన్వీనర్‌గా దాదాపీర్, కోఆర్డినేటర్‌గా రహమతుల్లా, ట్రెజరర్‌గా డాక్టర్ బేరిలా శ్రీనివాసులు, కార్యదర్శులుగా ఫైజ్ దస్తగిరి, యూత్ వింగ్ ప్రతినిధిగా ఆరీఫ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఉపాధ్యాయుడు సీతారామయ్య

కడప ఎడ్యుకేషన్ : అన్నదానం పేదల ఆకలి తీర్చే పుణ్యకార్యమని ఉపాధ్యాయులు సీతారామయ్య తెలిపారు. శనివారం ఆయన నగరంలోని పట్టణ నిరాశ్రయ గృహంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, పట్టణ నిరాశ్రయ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ జావీద్

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పొంది ఇతరులకు అవగాహన కల్పించాలని ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ పిలుపునిచ్చారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శనివారం నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కారులో వెళ్లే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. మహిళలు ద్విచక్ర వాహనంపై వెళ్ళేటపుడు డ్రెస్ చున్నీ, చీర కొంగు ప్రమాదవశాత్తు వీల్‌లో చిక్కుకుని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని, రోడ్డు భద్రత కోసం తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

పడకేసిన పర్యాటకం



పర్యాటకుల కోసం పాతకడప చెరువులో మూడు బోట్లు ఏర్పాటు చేసి పిల్లలు, పెద్దలను చెరువులోకి షికారుకు తీసుకుపోయేవారు. పర్యాటక శాఖ అధికారులు దీనిని సక్రమంగా నిర్వహించకపోవడంతో ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా తగ్గిపోయింది. దీంతో వేల రూపాయలు పెట్టి కొన్న బోట్లు ఇలా నిరుపయోగంగా పడి ఉన్నాయి.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్



రోడ్డా.. ఐతే ఏంటి..?



రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బ్లూ కలర్ బంకు, పక్కన మరమ్మతు కోసం పెట్టిన ఆటోలు

కడప అర్బన్: కడప నగరంలోని ఐ టి ఐ నుంచి అక్కాయపల్లి సివిల్ సప్లైస్ వారి పెట్రోల్ బంకు మీదుగా నబీకోటలోకి వెళ్లే రహదారి మార్గంలో ఇటీవల పెద్ద డ్రైనేజీ కాలువ ప్రమాదకరంగా ఉంటే కార్పొరేషన్ అధికారులు రోడ్డును వేయించారు. ఐతే ఆ రహదారి విశాలంగా మారడంతో బ్లూ రంగులో ఓ బంకును అక్రమంగా ఏర్పాటు చేశారు. మరోవైపు ఆటోలను మరమ్మత్తు చేసే వారు తాము మరమ్మత్తు చేసే ఆటోలను ఎంచక్కా రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేసేస్తున్నారు. ఆ దారిన ఓ వాహనం వెళితే మరో వాహనం కూడా వెళ్లకుండా చేసేస్తున్నారు. అదేమంటే ఖాళీగా వుందని పెట్టామని చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని కార్పొరేషన్ వారే చక్కదిద్దాలనీ స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వానపాము ఎరువులో అధిక పోషక విలువలు

పులివెందుల రూరల్: వానపాముల ఎరువులో అధిక పోషక విలువలు ఉంటాయని, పంట దిగుబడి నాణ్యత పెరుగుతుందని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని చిన్నకొండారెడ్డి కాలనీకి చెందిన పాలెం చంద్ర నిర్వహిస్తున్న వానపాముల ఎరువుల తయారీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడటంతో భూసారం, సమతుల్యత తగ్గిపోతోందని, రైతులు సేంద్రీయ ఎరువులపై ఆసక్తి చూపాలని సూచించారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రాథమిక సహకార సంఘం ప్రతినిధులకు శిక్షణ నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా వానపాముల ఎరువు తయారీ కేంద్రాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరి మాట్లాడుతూ పాలెం చంద్ర గత పదేళ్లుగా వాన పాము ఎరువు ఉత్పత్తి చేస్తున్నారని, 2019లో కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా వానపాముల తయారీపై సాంకేతిక శిక్షణ, మెలకువలు, నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. యువ రైతులు వ్యవసాయం, ఇతర అనుబంధ రంగాలలో వ్యాపార అభివృద్ధిని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం. ఎవరైనా ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్‌జీవో హోంలో పీసీపీఎన్‌డీటీ యాక్టుపై నిర్వహించిన సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులలో అర్హత ఉన్న వారు మాత్రమే స్కానింగ్ చేయాలని సూచించారు. స్కానింగ్ మిషన్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకుని స్కానింగ్‌కు వచ్చే వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వైద్యులు, స్కానింగ్ సెంటర్ల యజమానులపై, ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమనే ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ జె.వినయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

చింతకొమ్మదిన్నె: సీకే.దిన్నె మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవనంలో నిర్వహిస్తున్నట్లు చింతకొమ్మదిన్నె ఎంపీడీఓ కుల్లాయిబాబు తెలిపారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని అన్ని శాఖలకు సంబంధించిన పురోగతి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి



కార్పొరేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: జీవో నంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కోటిరెడ్డి సర్కిల్ నుంచి కడప మున్సిపల్ కార్పొరేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి పీవీ సుబ్బయ్య మాట్లాడుతూ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం అనేక రూపాల్లో నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరిగిన ధరలు, విద్యార్థుల ఫీజుల వలన కుటుంబ పోషణ కష్టమై, ఇంటి బాడుగ కట్టుకోలేక కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నెల 4 వ తేదీన విజయవాడలో జరిగిన ధర్నాలో తాము సమ్మె ప్రకటించి, ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో తాము విధిలేని పరిస్థితుల్లో నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నామన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, క్యాడర్ స్ట్రెంగ్త్ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ప్రకటించాలన్నారు. తాము సమ్మె చేస్తుంటే వార్డు అమినేటిస్ సెక్రెటరీ లతో పని చే యించుకోవాలని చూస్తున్నారని, వాల్వ్‌లు తిప్పే క్రమంలో పైపులైన్ సమస్యలు వస్తే కమిషనరే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రరెడ్డి, జిల్లా కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శులు ఆనంద రావు, బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ నగర ప్రధాన కార్యదర్శి కేశవులు, వాటర్ నాయకులు ఓ సుబ్బారాయుడు, గురువయ్య, గోవర్ధన్, చాపయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగాన్ని బలోపేతం చేయాలి



కడప మేయర్ సురేష్ బాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న మైనార్టీ విభాగం నాయకులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగాన్ని బలోపేతం చేయాలని కడప మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర మైనార్టీ విభాగంలో వివిధ పదవులు పొందిన వారు మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీలు ఎక్కువగా ఉన్న కడప నగరంలో మైనార్టీ విభాగం మరింత బలంగా తయారు కావాలన్నారు. ఆ దిశగా పదవులు పొందిన వారంతా కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మగ్బూల్ బాషా, షంషీర్, డివిజన్ ఇన్‌చార్జులు గౌస్‌బాషా, అలీ అక్బర్, పవర్ అల్తాఫ్, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



హిటాచీ ఢీకొనడంతో విరిగిపోయిన విద్యుత్ స్తంభం

కడప కార్పొరేషన్: కడప నగరంలో చిలకల బావి వద్ద విద్యుత్ ప్రమాదం జరక్కుండా రెండో శనివారం కాపాడింది. చిలకలబావి వీధిలో కాల్వ కట్ట పక్కనున్న కేసీ కెనాల్‌లో కొన్ని రోజులుగా పూడిక తీత పనులు జరుగుతున్నాయి. కేసీ కాలువలో ఉన్న చెత్తాచెదారాన్ని, పూడికను హిటాచీతో ఎత్తి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటలకు హిటాచీ ఆ మార్గంలో వెళుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కొద్ది దూరం లాక్కెల్లింది. హిటాచీ ఆలాగే ముందుకు వెళ్లి ఉంటే స్తంభం కిందపడేది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉంటే హిటాచీ డ్రైవర్‌కుగానీ, స్థానికులకుగానీ ప్రమాదం జరిగి ఉండేది. రెండో శనివారం కావడంతో విద్యుత్ సరఫరా లేకపోవడం...డ్రైవర్ అప్రమత్తమై పోల్ కిందపడకుండా హిటాచీని అడ్డుగా పెట్టడం వల్ల ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి సారూ!

నగర పాలక సంస్థలో గత ఏడాది నుంచి అధికార యంత్రంగా అస్తవ్యస్తంగా మారింది. నగరంలో 34వ డివిజన్‌లో గత ఆరు నెలలుగా స్థానికుల నివాసాలలో లో ఓల్టేజ్ సమస్య ఉందని పలుమార్లు మునిసిపల్ అధికారులకు విన్నపాలు చేసినా కనుకరించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కావున ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుచున్నారు.

-ఫొటో: సాక్షిఫొటోగ్రాఫర్, కడప



దాతృత్వం



పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు (ఇన్‌సెట్) రూ. 33 వేలు సాయం చేసిన గిరిజాకుమారి

కడప ఎడ్యుకేషన్: కడప చెమ్మియాపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవలే పదవీ విరమణ చెందిన గిరిజా కుమారి దాతృత్వం చాటుకున్నారు. దీంతో పిల్లలకు వసతి లభించింది. గిరిజాకుమారి కడప నగర శివార్లలోని తారకరామనగర్ పాఠశాలలో పిల్లలకు వసతి లేదని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుంది. దీంతో ఆమె స్పందించి సొంతంగా 33 వేల రూపాయలను ఇచ్చి పాఠశాలలో షెల్టర్‌ను నిర్మించి ఇచ్చింది. దీంతో పిల్లలకు వసతి సమకూరింది. ఇందుకు పాఠశాల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఇస్మాయిల్ స్వామి పీరు ఉత్సవం



ఉత్సవంలో ఇస్మాయిల్ పీరు



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సింహాద్రిపురం: మండలంలోని బిదినంచర్ల గ్రామంలో ఇస్మాయిల్ పీరు ఉత్సవం శనివారం వైభవంగా ముగిసింది. ఏటా ఈ పీరు ఉత్సవానికి ఇతర ప్రాంతాలలో స్థిరపడిన గ్రామస్తులు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో కులమతాలకతీతంగా కార్యక్రమం నిర్వహిస్తారు. శనివారం గ్రామ పురవీధుల గుండా ఉత్సవ పీరును డప్పు వాయిద్యాల నడుమ ఎంతో భక్తి శ్రద్ధలతో జలనిధికి తరలించారు. సింహాద్రిపురం మండలం, ఇతర మండలాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు.

గ్రామంలో యువకుల విచిత్ర వేషధారణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రవికుమార్ పర్యవేక్షించారు.

ఏటీఎం పనిచేయక ఇబ్బందులు



ఆర్టీసీ బస్టాండులో మూతపడిన ఏటీఎం గది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణీకుల అవసరాలు తీరేలా కడప ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎం పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రయాణీకులకు నగదు అవసరమైతే బస్టాండు వెలుపలికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ కేంద్రం ద్వారా లావాదేవీలు నిర్వహించేవారు. ముఖ్యంగా రాత్రి సమయంలో మహిళలు, యువతులకు ఈ ఏటీఎం కేంద్రం ఎంతోగానో ఉపయోగపడేది. అలాంటిది ప్రస్తుతం ఏటీఎం పనిచేయకపోవడంతో ప్రతినిత్యం ఏటీఎం గదికి సంబంధించిన షట్టర్ కిందికి వేసి ఉన్నారు. దీంతో ప్రయాణీకులు చేసేది లేక అటు అంబేడ్కర్ సర్కిల్‌కుగానీ, ఇటు హీరోహోండా షోరూం వద్దకుగానీ వెళ్లి నగదును డ్రా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఈ ఏటీఎం కేంద్రం పనిచేసేలా ఎస్‌బీఐ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

ప్రజల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టవా

కడప ఎడ్యుకేషన్: ప్రజల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని రెవల్యూషనరీ మార్కిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్ఎంపిఐ) రాష్ట్ర కార్యదర్శి గుజ్జల రమణయ్య అన్నారు. శనివారం కడప నగర శివార్లలోని కొప్పర్తి గ్రామ పంచాయితీలో గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇంటిస్థలాలను ఇచ్చి పక్కా గృహాలను గత ప్రభుత్వం నిర్మించిందన్నారు. అయితే ఆ కాలనీలో ప్రస్తుత ప్రభుత్వం సిమెంటు రోడ్లుకానీ, మంచినీటి సౌకర్యంగానీ, వీధిలైట్లను గానీ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలపై కూటమి ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం దారుణం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, కడప నగర నాయకులు రమేష్, సుబ్బరాయుడు, మల్లారెడ్డి, రవి, లక్ష్మీదేవి, నాగమునెమ్మ, రమాదేవిలతోపాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

'బాలవిహార్'లో విద్యార్థులు



గేయాలాపన చేస్తున్న కడప ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రసార భారతి (ఆకాశవాణి)లో శనివారం నిర్వహించిన బాల విహార్ కార్యక్రమంలో కడప శంకరాపురంలోని అంధుల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హెచ్‌ఎం, జిల్లా సైన్సు అధికారి ఎబినేజర్ ఆధ్వర్యంలో పాల్గొని గేయాలాపన చేశారు. ఇందులో భాగంగా విద్యార్థిని, విద్యార్థులు దేశభక్తి గేయాలు, సైన్సు, రాజ్యాంగంపైన పాటలు పాడటంతోపాటు ప్లాస్టిక్ భూతంపై ఏక పాత్రాభినయం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎబినేజర్ తెలిపారు. ఈ పాటలు, ఏకపాత్రాభినయంకు సంబంధించిన ప్రసారాలు త్వరలో రేడియోలో వస్తాయని ఆయన తెలిపారు.

విజయ సాధనకు స్పష్టమైన లక్ష్యం ఉండాలి



మాట్లాడుతున్న బ్రహ్మకుమారి శివలీల అక్కయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : మనిషి విజయ సాధనకు తొలుత స్పష్టమైన లక్ష్యం ఉండాలన్న విషయాన్ని గుర్తించుకోవాలని విశాఖపట్టణంకు చెందిన రాజయోగిని బ్రహ్మకుమారి శివలీల అక్కయ్య పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని ఓం శాంతి భవన్‌లో ఆంధ్ర- కర్ణాటక సబ్ జోన్ అదనపు ఇన్‌ఛార్జి, సీనియర్ రాజయోగిని గీతా బెహన్ ఆధ్వర్యంలో «విజయం యొక్క రహస్యం» అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శివలీల అక్కయ్య మాట్లాడుతూ విజయం అనేది సాధారణంగా చేకూరదని, అందుకు నిరంతర కృషి, మీపై, మీ సామర్థ్యంపై నమ్మకం ఉంచుకోవాలన్నారు. అలాగే సమయం పాలనపాటించాలని, సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. తాము చేయదలిచిన పని విజయవంతం అవుతుందని భావిస్తూ ముందుకు సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. అనంతరం శివలీల అక్కయ్య అందరిచేత రాజయోగ మెడిటేషన్ చేయించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

చింతకొమ్మదిన్నె: చింతకొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రముఖ వైద్యులు బీవీ.శివారెడ్డి, రవిశంకరరెడ్డి అధ్వర్యంలో చెక్కర వ్యాధి, రక్తపోటు పరీక్షలు చేయనున్నారు. డాక్టర్ బీవీ శివారెడ్డి చిన్న పిల్లలు, పురిటి పిల్లలకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నారు. అలాగే డాక్టర్ వి.రవిశంకరరెడ్డి ఎముకలు, కీళ్ళు, వెన్నెముక సమస్యలున్న వారిని పరీక్షించి మందులు ఇవ్వనున్నారని నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు.